


మెట్రో సిటీకి పక్కనే ఒక మండల కేంద్రం. ఆ పట్టణానికి చివర పెద్ద పెంకుటిల్లు. ఆ ఇంటి చుట్టూ ప్రహారి గోడలా బారులు తీరిన పొడుగాటి కొబ్బరి చెట్లు, వాటి సమీపంలో అక్కడక్కడ ఉన్న వేప చెట్లు, జామి చెట్లు- ఆ ఇంటికి ఎంతో శోభను తెచ్చాయి. ఒకప్పుడది ఆ ఊర్లో చెప్పుకోతగ్గ గొప్ప ఇల్లయినా ఇప్పుడు శిథిలావస్థలో ఉంది... మెడలో తళుక్కుమనే గొలుసు, కళ్ళకు నల్ల గాగుల్స్, చేతికి రోల్డ్ గోల్డ్ ఛేన్‌తో ఉన్న రిష్టు వాచి, తెల్ల లాల్చి ధోవతి దుస్తులలో జగన్నాథం పెదరాయుడిలా ఆ ఇంటి ముందు కూర్చున్నాడు, క్షణ క్షణానికి దృష్టిని రోడ్డు వైపు పోనిస్తూ.

# గాలివాన

రావిపల్లి నారాయణరావు

వాలు కుర్చీలో కూర్చున్న జగన్నాథం కొన్నాళ్ళు పంచాయితీ బోర్డు ప్రెసిడెంట్ పదవి వెలగ బెట్టాడు. ఆ రోజుల్లో అతని దర్శనం కోసం జనం క్యూలో నిలబడేవారు. చిన్న చిన్న తగవులకు కోర్టు చుట్టూ తిరగలేక ఆ ఊరి ప్రజలు తమ సమస్యలను జగన్నాథం దగ్గర మొఱపెట్టుకునేవారు.


పదవి పోయింది. స్వార్థం ఎక్కువైంది- డబ్బుకు ఆశ పడి మోసాలు చేసి పరపతి పోగొట్టుకున్న జగన్నాథం దగ్గర తీర్పు చెప్పించుకోటానికి ఇప్పుడు ప్రజలు మక్కువ చూపించటం లేదు. ఫలితంగా ఆర్థిక పతనం, అప్పుల వాళ్ళ శాపనార్థాలు- సంసారం ఈదటం కష్టమైపోయింది జగన్నాథానికి. అందుకొచ్చిన కొడుకు కొరగాని కొయ్యలా తయారయాడు. జగన్నాథం గుణగణాలు అతను పుణికి పుచ్చుకోలేదు. "చూడు భూషణం, నీతి సూత్రాలు వేధికల మీద చెప్పటానికే పనికొస్తాయి. ఆచరణకు పనికి రావు. డబ్బు లేనిదే జీవితం గడవదు. నీకు తెలుసో తెలీదో కత్తికి లేని పదును డబ్బుకు ఉంది. డబ్బుతో ఎన్ని పనులైనా చేయొచ్చు. కింద పడబోయే

# కథ

మనిషి జీవితాన్ని కాపాడొచ్చు. అహంకారంతో ఆకాశంలో పరుగెత్తే పెద్ద మనుషుల జాతకాలను తలక్రిందులు చేయొచ్చు,'' అంటూ అప్పుడప్పుడు కొడుక్కి బోధపరిచే జగన్నాథానికి... ''డాడీ, నీ మాటలు నేను వినను. నిజానికి నువ్వు చేసిన ఏ పనీ నాకు నచ్చదు. తగవుల పరిష్కారం అన్న పేరుతో పేదల కడుపులు కొట్టడం నాకు చేత కాదు,''... అని తడుముకోకుండా సమాధానమిస్తాడు భూషణం.

తగవులకు సంబంధించిన పనులు తగ్గడంతో జగన్నాథం ఇప్పుడు దాదాగిరి పనులు చేపట్టాడు. పెళ్ళిళ్ళు చెడగొట్టడం, మర్డర్లు చేయించటం మొదలైన పనులలో ఇప్పుడతను చాలా బిజీ అయిపోయాడు.

జగన్నాథం సిగరెట్ పొగ వొదుల్తూ రోడ్డు వైపు చూశాడు. రోడ్డు నుండి కిందకు దిగి వచ్చిన మారుతీ కారు తన వాకిట్లో ఆగింది. జగన్నాథం లేచి కారు దగ్గరకి పరుగెత్తాడు. అప్పుడే కారు డోరు తెరిచి వాకిట్లో అడుగు పెట్టాడు ఒక పెద్ద మనిషి. డబ్బున్న మారాజులా కనిపించే అతని వయసు నలభైకి అటు ఇటు ఉండొచ్చు.



''నమస్కారం. రండి... రండి... మిమ్మల్ని ఎప్పుడూ చూసినట్టు లేదు,'' నవ్వుతూ రెండు చేతులు జోడించి అతని ఎదుట నిలబడ్డాడు జగన్నాథం.

''నమస్కారం, మీరు జగన్నాథం గారు-అవునా?.... నేను మీ పేరు విన్నాను కాని కలుసుకునే అవకాశం కలగలేదు. ఇప్పుడు మీతో పని పడింది,'' మెల్లగా అన్నాడతను, భుజం పైనున్న కండువా సర్దుకుంటూ. ''రండి అలా వరండాలో కూర్చుని మాట్లాడుకుందాం,'' అన్నాడు జగన్నాథం.

''వరండాలో వద్దు, మన మాటలు మూడో మనిషి చెవిన పడకూడదు,'' చెప్పాడు కారులో వచ్చిన వ్యక్తి.

''రహస్యమైన విషయమైతే చెప్పండి, ఆ గదిలో కూర్చుందాం. అక్కడికి పిట్ట మనిషి రాడు. అక్కడి మాటలు బయటకు వినబడవు. ఏమంటారు?'' అడిగాడు జగన్నాథం.

''సరే, అలాగే కానీండి''

''ఇద్దరూ లోపలి గదిలో ఉన్న రెండు కేన్ ఛైర్లలో సెటిలైపోయారు. గాలి, వెలుతురు ప్రవేశానికి నోచుకోని ఆ గదిలో ఇరవైయ్యైదు వోల్టుల బల్బు మందంగా వెలుగుతోంది. ఎవరూ లోపలికి రాకుండా, కుర్చీలో కూర్చోక ముందే గది తలుపులు రెండూ బిడాయించాడు జగన్నాథం.

సిల్కు చొక్కా జేబు నుండి సిగరెట్ ఒకటి తీసి ఆ పెద్ద మనిషి పెదాల మధ్య పెట్టగానే అగ్గి పెట్టె కొట్టి సిగరెట్ ముట్టించటంలో సహాయపడ్డాడు జగన్నాథం.

''ఈ రూమ్‌లోకి ఎవరూ రారుగా...'' అడిగాడు ఆ పెద్ద మనిషి.

''ఆ భయం మీ కక్కర్లేదు,'' చెప్పాడు జగన్నాథం.

''నా పేరు కనకాచలం,'' కారు దిగి వచ్చినతను అన్నాడు.

''అలాగా... మీ పేరు కూడా నేను వినలేదు.''

''నేను ఈ ప్రాంతపు మనిషిని కాదు. ప్రక్కనున్న పట్టణం నుండొచ్చాను.''

''ఏ ప్రాంతం నుండొస్తే నేం లెండి, ప్రాంతం ముఖ్యం కాదు- కావలిసింది పని.''

''నాకో చెల్లెలుంది. అయితే అది నా తోబుట్టువు కాదు. మా బాబాయిగారి ఒక్కగానొక్క కూతురు. పేరు చిత్ర. బాబాయికి మగ పిల్లలు లేరు. చిత్రకి అయిదేళ్ళు నిండకముందే ఆమె తల్లి కన్ను మూసింది. బాబాయి మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. అందుకే చిత్ర చాలా గారాబంగా పెరిగింది. అనుకున్నది సాధించాలన్న పట్టుదల ఆమెది. చాలా చక్కగా ఉంటుంది. గడచిన మే నెలలో డిగ్రీ పాసయింది. ఆ సంతోష వార్త వినటానికి మా బాబాయి లేడు. ఆయన ఈ లోకాన్ని విడిచి పది నెలలు పైబడింది''.

''కథలా చెప్పుకొస్తున్నారు, సినిమా వాళ్ళకైతే పనికొస్తుందేమో. మరినాకు...'' ఏదో చెప్పబోయి ఆగిపోయాడు జగన్నాథం.

''నన్ను చెప్పనీయండి, మా బాబాయికి పట్నంలో పెద్దిల్లు ఉంది- రెండంతస్తులది. కొనసీమలో ఆయన అత్తగారిచ్చిన పదెకరాల పంట భూమి ఉంది. పట్నంలో ఒక రైస్ మిల్లుంది. ఈ ఆస్తికి వారసురాలు చిత్ర. ఈ మధ్య ఆ అమ్మాయి ప్రేమలో పడినట్టు తెలిసింది. ప్రేమ వ్యవహారం నాకు గాని, నా భార్యకు గాని ఆమె చెప్పలేదు.''

''మీరు భలే వారండి, నేను నా బాయ్ ఫ్రెండుని ప్రేమిస్తున్నానని ఈ రోజుల్లో ఏ అమ్మాయైనా చెబుతుందా మీ పిచ్చగాని... అందుకు పెద్ద వాళ్ళు అంగీకరించరని వాళ్ళకి తెలుసు,'' నవ్వాడు జగన్నాథం.

''వినండి, పెళ్ళి జరిగే వరకు ఆస్తిపై చిత్రకు ఎటువంటి అధికారం లేదు. అంతవరకు ఆస్తి వ్యవహారాలు, లావాదేవీలు, రాబడి ఖర్చులు చూడాల్సిన బాధ్యత నాకు వొప్పజెప్తూ చనిపోయే ముందు విల్లు రాశాడు మా బాబాయి. ఆస్తిపై ప్రస్తుతం అధికారం నాదే... పెళ్ళి జరిగిన మరుక్షణం ఆ అధికారం చిత్ర చేజిక్కించుకుంటుంది. ఇదీ జరిగిన కథ. ఇక జరుగబోయే కథ కోసం నేను మీ దగ్గర కొచ్చాను,'' చెప్పాడు కనకాచలం, కాలిన సిగరెట్ ముక్కన యాష్ ట్రేలో పడేస్తూ.

''మీరు చెప్పింది అర్థమైంది. ఆస్తి చిత్రకు దక్కకూడదు. అది శాశ్వతంగా మీ చేతిలో ఉండాలి. అంతే కదా,'' అన్నాడు జగన్నాథం.

''అంత సలువుగా చెబుతున్నారు, అదెలా సాధ్యం?'' జగన్నాథం మొహంలోకి సూటిగా చూశాడు కనకాచలం.

''ఈ జగన్నాథానికి సాధ్యం కానిది ఏదీ లేదు?''

''అంటే సామదాన దండోపాయాలు...''

''అది పాతకాలం నాటి మాట. ఇరవైయొకటో శతాబ్దం ఇది. ఈ శతాబ్దంలో లభ్యం కాని వేమిటి చెప్పండి. పైగా చిత్ర ఈ మధ్యనే డిగ్రీ పాసయిందని చెబుతున్నారు. అంటే వయసు ఇరవైకి మించి ఉండదు కదా. అటువంటప్పుడు అమ్మాయిని లేపేయటం ఎంతసేపు... నా దగ్గరున్న మనుషులు ఆ పని చూసుకుంటారు. గొర్రెల్ని జీర్ణించుకున్నవారికి కోడిపెట్ట ఒక లెక్కా.... అమ్మాయికి ఈ భూమ్మీద నూకలు లేకుండా చేస్తాను, మీరు వర్రీ కావద్దు.''

''అంటే?''

''అంటే ఏముంది. అమ్మాయిని పై లోకాలకు పార్సెల్ చేయటం. అప్పుడే కదా మీకు ఆస్తి దక్కేది.''

''నో... నో... అంత పని చేయొద్దు జగన్నాథం గారూ! ఆస్తి కోసం అమ్మాయిని బలి తీసుకోవటం నా కిష్టం లేదు.''

''మీతో గొప్ప చిక్కొచ్చింది కనకాచలం గారూ!... ఆస్తి కావాలంటారు, అమ్మాయి ప్రాణాలు తీయొద్దం టారు,'' విసుక్కున్నాడు జగన్నాథం.

''శాంతించండి, మా ఆవిడ కూడా ఇలాగే చిరాకు పడుతుంది. అమ్మాయి ప్రాణాలు తీయకుండా ఎందుకు పని జరుగదు?... మీ ఇంటర్‌నెట్లు, ఈ మెయిళ్ళు ఉపయోగించి అమ్మాయి మనసు మార్చండి. చిత్రకు ఎక్కడో ఒక లైబ్రరీలో అబ్బా యితో పరిచయమేర్పడింది. అది పెళ్ళికి దారి తీసింది. ఆ అబ్బాయిని తప్ప మరో మనిషిని పెళ్ళి చేసుకోనం టుంది చిత్ర. ఆ అబ్బాయితో పెళ్ళి జరగకుండా మనం చేయగలిగితే చిత్ర మరొకరితో ప్రేమాయణం సాగించదన్న నమ్మకం నాకుంది.''

''పోనిద్దురూ, మీ బాబాయి కూతురే కదా పెళ్ళి చేసుకోటానికి ముచ్చటపడుతుంది. అక్షింతలు వేసి పుణ్యం కట్టుకోరాదూ!'' ఏ మూడ్‌లో ఉన్నాడో మరి, పెళ్ళి జరిపించటం మంచిదని సలహా ఇచ్చాడు జగన్నాథం.

''నేను కూడా అలాగే అనుకున్నాను. మీరిచ్చిన సలహాలాంటిదే నేను కూడా ఇచ్చాను. కాని మా ఆవిడ అందుకు పచ్చ జెండా ఊపలేదు. ఎట్టి పరిస్థి తుల్లోను చిత్ర పెళ్ళి జరగటానికి వీల్లేదని ఆవిడ ఆర్డరు జారీ చేసింది. పెళ్ళి చేసుకోగానే తాళి కట్టిన మొగుడు ఆస్తిని తీసుకు రమ్మని చిత్రని వేధించ కుండా ఉండడు కదా అంటుంది మా ఆవిడ. కరెక్ట్ కాదంటారా?'' అన్నాడు కనకాచలం.

''అదీ పాయింటే. మరి మీ సలహా ఏవిటో వివ రంగా చెప్పండి,'' కనకాచలం వైపు చూశాడు జగన్నాథం. ''నేను ఇంతకు ముందు చెప్పినట్టు అమ్మాయి మనసు మారేలా చేయటం. అలా చేసిన ప్పుడు కొన్ని సంవత్సరాలు పెళ్ళి మాటెత్తదు చిత్ర. ఆ తర్వాత సంగతంటారా- అప్పుడు చూసుకుందాం. మీరున్నారుగా!'' నవ్వాడు కనకాచలం.

''నాకర్థమైంది. మిగిలిన తతంగం నేను చూసు కుంటాను. కాని నాకు కొంచం టైము కావాలి.''

''చంపేశారు, ఇది చాలా అర్జంటు. మీరు ఆలస్యం చేశారంటే ఈ లోగా మన కళ్ళు గప్పి చిత్ర, ఆ అబ్బాయి ఏ సమాజానికో వెళ్ళి దండలు మార్చేసు కుంటారు. చేతులు కాలేక ఆకులు పట్టుకున్నట్టవు తుంది మన పరిస్థితి.''

''మీరు చెప్పింది కరక్టే- నా దగ్గర జమాజెట్టీ ల్లాంటి మనుషులు నలుగురున్నారు. వాళ్ళయితే ఈ పని త్వరగా పూర్తి చేస్తారు. మరి ఖర్చు ఒక 'ల'కారం అవుతుంది,'' చెప్పాడు జగన్నాథం.

''ఓ.కే. అలాగే... అడ్వాన్సుగా ఈ డబ్బుంచండి'' ఐదు వందల రూపాయల కట్ట ఒకటి టీపాయ్ మీద పెట్టి లేచాడు కనకాచలం. తృప్తిగా నవ్వాడు జగ న్నాథం టీపాయ్ మీదున్న నోట్ల కట్ట తీసుకుంటూ. యాభై వేలు కళ్ళతో చూడగానే భోగం వీధి పంకజం తన కళ్ళ ముందు కదలాడినట్టనిపించింది.

''జగన్నాథం గారూ! ఇక నే వెళ్ళిరానా...'' కనకా చలం మాటలు చెవిని పడగానే ఏమఱపాటునున్న జగన్నాథం తుళ్ళి పడ్డట్టు లేచి నిలబడ్డాడు. అతను నాలుగడుగులు ముందు కెళ్ళి గది తలుపులు తెరి చాడు. ఈదురు గాలి రివ్వున లోపలికి చొరబడింది. విజృంభించిన గాలికి ఊగిసలాడే కొబ్బరి మట్టలు, ఎగిరే ఆకులు, విరిగిన కొమ్మలు గది నుండి బయ టకు రాగానే ఆ ఇద్దరి కంటబడ్డాయి. ఉరుములు విన బడ్డ కొన్ని క్షణాలకే వర్షం ప్రారంభమైంది. అది ఇంకా ఎక్కువయ్యే సూచనలు కనబడ్డంతో జగన్నాథం దగ్గర శలవు తీసుకుని కార్లో కూర్చున్నాడు కనకాచలం. వాకిట నుండి రోడ్డు పైకి మళ్ళిన మారుతీ కారు మెల్లగా వేగాన్ని అందుకుంది.

***

భూషణం గురించి ఎన్నో విషయాలు చిత్ర దృష్టికి వచ్చాయి. అతను అమ్మాయిలతో తిరుగుతున్నాడని, చాలామంది అమ్మాయిలు అతని వలలో పడి మోస పోయారని మొదలైన గాలి కబుర్లు ఆమె చెవిన పడ్డాయి. ఆమె వాటిని సీరియస్‌గా తీసుకోలేదు. కాని ఆ తర్వాత ప్రత్యక్షంగా చూసిన కొన్ని సంఘటనలు భూషణం ఒక వంచకుడు అన్న అభిప్రాయానికి తను వచ్చేటట్టు చేశాయి. బస్సుల్లోను, సినీమా థియేటర్ల లోనూ తను స్వయంగా విన్న మాటలు, మొబైల్ ఫోనుల్లోను, ఇంటర్నెట్లలోను కళ్ళతో చూసిన అసభ్య కరమైన ఫోటోలు ఆమె అభిప్రాయాన్ని బలపర చాయి. అప్పటి నుండి చిత్ర భూషణాన్ని కలుసుకో లేదు. కలుసుకోటానికి ప్రయత్నించే భూషణానికి అవకాశం ఆమె ఇవ్వలేదు.

చిత్రలో కలిగిన ఈ హఠాత్పరిణామానికి కారణం ఎంత ఆలోచించినా తెలియలేదు భూషణానికి. తనతో చిత్ర ఎందుకు మాట్లాడటం లేదు?... ఎందుటకు వెళ్ళి పలుకరించినా చూసి చూడనట్టు ఆమె ఎందుకు పక్కకు తప్పుకుంటోంది?? - అర్థం కాక భూషణం ఉన్మాదిలా తిరగటం మొదలుపెట్టాడు. ఆ విషయం గురించి అతని సన్నిహితులకు చెప్పాడు. రెండు రోజుల నుండి అతను ఇంటికి కూడా వెళ్ళలేదు.

***

ఏదో పని మీద విజయవాడ వెళ్ళిన జగన్నాథం ఇంటికి తిరిగి రాగానే తన కోసం ఎదురు చూస్తున్న కనకాచలం కలిసాడు.

'నమస్కారం జగన్నాథం గారూ! మీ కోసం చాలాసేపటి నుంచి వెయిట్ చేస్తున్నాను. మీకు థేంక్స్ చెప్పటానికే వచ్చాను. మన ప్లాను సక్సెస్ పెళ్ళి మాటెత్తితే ఇప్పుడు అగ్గి మీద గుగ్గిలంలా భగ్గున పైకి లేస్తుంది చిత్ర. మరెప్పుడూ పెళ్ళి ప్రసక్తి తీసుకు రావ ద్దని ఆమె తన గదిలోకెళ్ళి తలుపు మూసుకుం టుంది.... మనకు కావాల్సింది అదే కదా! ఇప్పుడు మా ఆవిడ చాలా సంతోషంగా ఉంది. ఇచ్చిన మాట ప్రకారం ఇవ్వవలసిన పైకం తెచ్చాను- తీసుకోండి,'' డబ్బు జగన్నాథం చేతిలో పెట్టి ఇంటి ముఖం పట్టాడు కనకాచలం. ఇంటికెళ్ళగానే అతనికి తెలి సింది చిత్ర ఆత్మహత్య చేసుకుందని. పోలీసు దర్యా ప్తులో లభించిన ఒక ఉత్తరం ద్వారా ఆమె ఆత్మహత్య చేసుకున్నట్టు తేలింది- ''అన్నయ్య గారికి, నేను భూషణాన్ని ప్రేమించాను. అతని పేరు ముందుగా నేను చెప్ప లేదు- మా పెళ్ళికి మీరు అంగీకరించరని. భూషణం ఒకరిద్దరు అమ్మాయిలను వెంటేసుకు తిరు గుతున్నట్టు ఈ మధ్యనే తెలిసింది. మొదట నేను నమ్మలేదు. కాని ప్రత్యక్షంగా చూసిన సంఘటనలు, ఇంటర్నెట్లో చూసిన ఫోటోలు మొదలైనవి నమ్మే టట్టు చేశాయి.... మనిషికున్నది ఒకే మనసు. మనసి చ్చిన మనిషి తన కోర్కెలను తీర్చుకున్న తర్వాత పెళ్ళికి వెనుకాడితే ఏ అమ్మాయైనా మనుగడ సాగిం చదు. అమ్మాయిలతో తిరుగుతున్న భూషణం పెళ్ళికి వాయిదా వేస్తుండటంలో ఉద్దేశ్యం అదే అయి ఉంటుంది. అందుకే నేను ఆత్మ హత్య చేసుకుంటు న్నాను- చిత్ర.'' ఉత్తరం చదివాడు కనకాచలం. మన చేతికి మట్టి అంటకుండా పనులు జరగాలి- ఎవరో చెప్పిన మాటలు జ్ఞప్తికొచ్చాయేమో కనకాచలం నోరు విప్పలేదు, మౌనం వహించాడు.

చిత్ర తనను తప్పుకు తిరగటానికి కారణం ఏమిటో అర్థం కాని భూషణానికి ఒక రోజు తెలి సింది- చిత్ర ఆత్మహత్య చేసుకుందని. దానికి కారణం భూషణం అన్న విషయం కూడా బయటపడింది.

***

చిత్ర ఆత్మ హత్య చేసుకుందన్న వార్త తెలిసిన రెండు రోజులకు కొరియర్ ద్వారా వచ్చిన ఉత్తరం అందుకుని చదివాడు జగన్నాథం- ''చిత్రను నేను ప్రేమించాను. చిత్ర కూడా నన్ను ప్రేమించింది. పెళ్ళి చేసుకోటానికి నిశ్చయించుకున్నాం. మా ఇద్దరి మనసులు కలిశాయి. ఇద్దరి శరీరాలు ఏకమయాయి. నేను ఆమెను మోసం చేయలేదు. ఆమె కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధప డ్డాను. ఇటీవల మా ఇద్దరి మధ్య మనస్పర్థలు చోటు చేసుకున్నాయి- కాదు ఎవరో సృష్టించారు. చిత్ర వాళ్ళ అన్నయ్యకి ఒక మారుతీ కారు ఉంది. ఆ కారు మనిం టికి వచ్చినట్టు నాకు తెలిసింది. ఆ కారు రాకకి, చిత్ర ఆత్మహత్యకి ఏదో లింకు ఉంది. నా మీద చిత్రకు అను మానం కలిగేటట్టు ఎవరో కథ అల్లారు. ఆ మధ్య రెండు సార్లు అమ్మాయిలను స్కూటర్ మీద ఎక్కించుకోవా ల్సిన పరిస్థితి వచ్చింది. కాలేజీ ఎగ్జామినేషన్‌కి అర్జం టుగా వెళ్ళాలని ఒకరు, ఆసుపత్రి ఎమర్జెన్సీ వార్డులో తల్లిని చూడాలని మరొకరు రిక్వెస్టు చేసి, నా స్కూటర్ ఎక్కారు. ఇది కూడా చిత్రకు నా మీద అనుమానం కల గటానికి ఆడిన నాటకమని ఇప్పుడు నాకు అర్థమౌ తోంది. ఏది ఏమైనా చిత్ర అమాయకురాలు. నన్ను అపార్థం చేసుకుని ఆత్మహత్య పాల్పడింది. చిత్ర లేకుండా నేను జీవించలేను. ఆమె చావుకు నేనే బాధ్యుణ్ణి. అందుకే ఆమెను వెతుక్కుంటూ నేను తెలి యని లోకాలకు వెళ్ళిపోతున్నాను. - భూషణం.''

ఉత్తరం చదివిన జగన్నాథం కుప్పలా నేల మీద పడిపోయాడు. కొన్ని క్షణాలు అతని నోట మాట రాలేదు. పక్కన నిలబడి చూస్తున్న వ్యక్తి, కుప్పలా కిందికి వొరిగిపోయిన జగన్నాథం మొహం మీద నీళ్ళు జల్లి లేవ దీసి అరుగు మీద కూర్చోపెట్టాడు. దుఃఖాన్ని కంట్రోల్ చేసుకోలేకపోయాడు జగన్నాథం.

''నేను ఎన్నుకున్న మార్గం మంచిది కాదని భూషణం ఎప్పుడో చెప్పాడు. కాని నేను వినలేదు. అందుకే భగవంతుడు నాకీ శిక్ష విధించాడు.'' బావు రుమన్నాడు జగన్నాథం.